ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మహబూబాబాద్

ఆదివారం 7 సెప్టెంబరు 2025

జిల్లాలో యూరియా కొరతపై రైతుల నిరసనలు తీవ్రరూపం దాల్చాయి. పంటలకు సరిపడా ఎరువు అందకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లా కేంద్రంతోపాటు పలు మండల కేంద్రాల్లో ధర్నా, రాస్తారోకోలు చేపట్టారు. మానుకోటలో యూరియా లారీపై దాడి చేసి ఐదు బస్తాలు ఎత్తుకెళ్లారు. ఎండవేడిమి తట్టుకోలేక మహిళా రైతులు చెప్పులను క్యూలైన్‌లో పెట్టి పక్కనే ఉన్న చెట్ల కింద కూర్చున్నారు. ఎండ వేడిమికి ఓ మహిళా రైతు సొమ్మసిల్లి పడి పోయింది. దీంతో జిల్లా ఎస్పీ ఘటనా స్థలికి చేరుకుని యూరియా పంపిణీలో పాల్గొన్నారు. అలాగే నెల్లికుదురు, గూడూరు, ఇనుగుర్తి మండల కేంద్రాల్లో రైతులు ఆందోళనలు చేపట్టారు. డోర్నకల్‌లో ఎరువుల బస్తాల కోసం రైతులు బారులు తీరారు.



నెల్లికుదురులోయూరియా కోసం తోపులాటలో కింద పడిపోయిన రైతు భూక్య రమేష్



మహబూబాబాద్ పీఏసీఎస్ కార్యాలయం వద్ద క్యూ లైన్‌లో నిలుచున్న రైతులు

రైతుల ఆగ్రహం

జిల్లాలో యూరియా కొరతపై పెల్లుబికిన నిరసనలు

- మానుకోటలో లారీపై దాడి
- ఐదు బస్తాలు అపహరణ
- ఎండ వేడిమికి సొమ్మసిల్లి పడిపోయిన మహిళా రైతు
- ఘటనా స్థలానికి చేరుకొని యూరియా పంపిణీ చేసిన జిల్లా ఎస్పీ
- నెల్లికుదురు, గూడూరు, ఇనుగుర్తిలో ఆందోళనలు
- డోర్నకల్‌లో బారులు తీరిన రైతులు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం (పీఏసీఎస్)కార్యాలయానికి శనివారం యూరియా లోడుతో వచ్చిన లారీపై రైతులు రాళ్లు, కర్రలతో దాడిచేసి ఐదు బస్తాలను అపహరించుకుపోయారు. యూరియా కోసం క్యూలైన్‌లో నిలబడిన మానుకోట మండలం దూద్యతండాకు చెందిన మహిళా రైతు భూక్య వసంత సొమ్మసిల్లి పడిపోయింది. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ పీఏసీఎస్ కార్యాలయం వద్దకు చేరుకొని రైతులను శాంతింపజేశారు. పీఏసీఎస్ కార్యాలయానికి యూరియా కోసం ఉదయం 9 గంటలకు భారీగా చేరుకుని క్యూలైన్‌లో నిలుచున్నారు. పట్టాదార్ పాస్ పుస్తకాల జిరాక్స్ కాపీలతో ఒక వైపు మహిళా రైతులు, మరోవైపు రైతులు వేర్వేరు క్యూలైన్‌లలో నిలుచున్నారు. ఎండవేడిమి తట్టుకోలేక మహిళా రైతులు చెప్పులను క్యూలైన్‌లో పెట్టి పక్కనే ఉన్న చెట్ల కింద కూర్చున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయం దాటుతున్నప్పటికి యూరియా పంపిణీ చేయకపోవడంతో ఆగ్రహించిన రైతులు అప్పటికే వచ్చి ఉన్న యూరియా లారీపై రాళ్లు, కర్రలతో దాడి చేయడంతో అద్దం పగిలిపోయింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న మానుకోట టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి పరిస్థితి చేదాటి పోతుందని తెలుసుకుని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఎస్పీ వెంటనే మహబూబాబాద్, తొర్రూరు డీఎస్పీలు తిరుపతిరావు, కృష్ణకిషోర్, పలువురు సీఐలను పీఏసీఎస్ కార్యాలయం వద్దకు పంపించారు. అనంతరం ఎస్పీ అక్కడకు చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. రైతులతో మాట్లాడి శాంతింపజేశారు. పీఏసీఎస్ కార్యాలయానికి మొత్తంగా సుమారు 777 బస్తాల యూరియా రాగా రైతులను క్రమ పద్ధతిలో పిలిచి ఒక్కొక్కరికి ఒక బస్తా చొప్పున పంపిణీ చేశారు. స్వయాన జిల్లా ఎస్పీ పీఏసీఎస్ కార్యాలయం వద్దకు చేరుకొని రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేయడంతో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.



నెల్లికుదురులో సొసైటీ ఎదుట యూరియా కోసం ధర్నా చేస్తున్న రైతులు



మహబూబాబాద్ పీఏసీఎస్ కార్యాలయం వద్ద యూరియా లారీపై రాళ్లు, కర్రలతో దాడి చేయడంతో పగిలిపోయిన అద్దం

పీఏసీఎస్ వద్ద రైతుల ధర్నా

నెల్లికుదురు(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద శనివారం ధర్నా చేశారు. పీఏసీఎస్ పరిధిలోని రామన్నగూడెం, నైనాల బ్రాహ్మ కొత్తపెల్లి, రైతులు నెల్లికుదురుకు చేరుకొని యూరియా కూపన్ల కోసం ఎదురుచూశారు. సొసైటీకి 400 బస్తాలు, ఆగ్రోస్ రైతుసేవా కేంద్రానికి 100బస్తాలు రావడంతో కూపన్ల కోసం తోపులాటలో రైతు భూక్య రమేష్ కిందపడిపోయాడు. స్పృహ కోల్పోవడంతో తోటి రైతులు మంచినీరు తాగించి కాపాడారు. ఆగ్రోస్ రైతు సేవాకేంద్రం నిర్వాహకులు కూపన్లను వెదజల్లడంతో రైతులు (మిగతా 8వ పేజీలో)

యూరియా సరఫరాకు పకడ్బందీ చర్యలు

- నిబంధనలు అతిక్రమించిన షాపుల లైసెన్స్ రద్దు
- జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్

8



మహబూబాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల ఫ్రెషర్స్ డేలో మాట్లాడుతున్న ఎంపీ పోరిక బలరాంనాయక్

లక్ష్యంతో విద్యనభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్

- విద్య, వైద్య రంగానికి సర్కార్ పెద్దపీట
- మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన భవనంలో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రథమ, తృతీయ సంవత్సర విద్యార్థులకు ఓరియంటేషన్, ఇండక్షన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ... పూర్వంలో విద్యుత్ సదుపాయం లేక చీకట్లో దీపాల వెలుగులో విద్యనభ్యసించిన వారు ఉన్నత స్థానాలకు ఎదిగారని తెలిపారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పటిష్టపరిచేందుకు కాంగ్రెస్ సర్కార్ కట్టుబడి ఉందని, విద్యార్థుల కష్టాలను గుర్తించి కాస్మెటిక్, మెస్ చార్జీలు పెంచారని చెప్పారు. జీవితంలో విద్య, ఆరోగ్యం ఎంతో ముఖ్యమని అందుకోసం విద్య, వైద్య రంగానికి రాష్ట్ర సర్కార్ పెద్దపీట వేస్తూ అధిక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణానికి కృషి

ఇంజనీరింగ్ కళాశాల భవన నిర్మాణానికి కృషి చేయనున్నట్లు మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ తెలిపారు. అన్ని హంగులు, వసతులతో కళాశాలను నిర్మించాలనే సంకల్పంతో పట్టణంలో 70 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించినట్లు వివరించారు. విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నత స్థానాల్లో నిలిచి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో తరగతుల బోధన జరుగుతుందని, అధ్యాపకులు చెప్పిన పాఠాలను శ్రద్ధతో విని అత్యుత్తమ మార్కులు సాధించి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలన్నారు. తొలుత తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఆపై జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ కె.కుమార్ రెడ్డి ఆన్‌లైన్‌లో సందేశాన్ని వినిపించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ బాలునాయక్, ప్రిన్సిపాల్ ఎ.బలరాంనాయక్ పాల్గొన్నారు.

పొలానికి నీరు పెడుతుండగా..

విద్యుదాఘాతంతో రైతు మృతి

6



సాయికుమార్ (ఫైల్)

లంబాడీలు, ఆదివాసీల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్రలు

- బీఆర్ఎస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తున్నాయి..
- యూరియా విషయంలో ఆందోళన వద్దు
- మానుకోట ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్

6

ఆస్పత్రికి ముహూర్తం ఖరారు చేయండి

- ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్
- మరిపెడ పీహెచ్‌సీని తనిఖీ చేసిన వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్

మరిపెడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మరిపెడలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి ముహూర్తం ఖరారు చేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్‌ను కోరారు. శనివారం సాయంత్రం వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్ విప్ రాంచంద్రునాయక్, మానుకోట ఎంపీ బలరాంనాయక్‌లతో కలిసి మరిపెడ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాంచంద్రునాయక్ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్‌తో కొద్దిసేపు మరిపెడ వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులపై చర్చించారు. ఫ్యూచర్ ప్లాన్‌తో ఆస్పత్రి భవన నిర్మాణ పనులను రూపొందించుకొని పనుల ప్రారంభానికి ముహూర్తం ఫిక్స్ చేయాలని హెల్త్ డైరెక్టర్‌ను కోరారు. అదేవిధంగా గత నెల రోజులుగా వర్షాలు పడుతున్నందున వైరల్ ఫీవర్, మలేరియా, డెంగీ, ఇతర సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున ఏమాత్రం జ్వరం, జలుబు చేసినా వెంటనే ఆయా గ్రామాల హెల్త్ సబ్ సెంటర్లు, పీహెచ్‌సీ ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే, ఎంపీ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ రవి రాథోడ్, మండల్ మెడికల్ ఆఫీసర్ గుగులోత్ రవినాయక్, వైద్య సిబ్బంది, స్థానిక కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.



రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్‌తో చర్చిస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, ఎంపీ బలరాంనాయక్

24 గంటలు వైద్యసేవలు అందించాలని..

వాటర్ ట్యాంకు ఎక్కిన యువకుడు

కేసముద్రం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేసముద్రం పీహెచ్‌సీలో 24 గంటల వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేస్తూ చైతన్యనగర్ కాలనీకి చెందిన వల్లందాసు సతీష్ అనే యువకుడు శనివారం అదే ఆస్పత్రి ఆవరణలోని వాటర్ ట్యాంకు ఎక్కాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అతన్ని సముదాయించి కిందకు దింపారు. అనంతరం సతీష్ మాట్లాడుతూ కేసముద్రం మునిసిపాలిటీలో 24 గంటల వైద్యసేవలు లేక పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఇక్కడి ఆస్పత్రిలోనే అన్నిరకాల వైద్య పరీక్షలు, నిరంతరం వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



కేసముద్రం పీహెచ్‌సీ ఆవరణలోని వాటర్ ట్యాంకు ఎక్కిన యువకుడు

జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా పీఎంశ్రీ స్కూల్ జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9, 11 తరగతుల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ శనివారం తెలిపారు. విద్యార్థులు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన వారై ఉండాలని, 9వ తరగతికి దరఖాస్తు చేసుకునేందుకు 2025-26లో 8వ తరగతి చదువుతూ 1 మే, 2011 నుంచి జూలై 31, 2013 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. 11వ తరగతికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతూ ఉండాలని, 1 జూన్, 2009 నుంచి జూలై 31, 2011 మధ్య జన్మించి ఉండాలని సూచించారు. 9వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ https://cbseitms.nic.in/2025/nvsix దరఖాస్తు చేసుకోవాలని, 11వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ https://cbseitms.nic.in/2025/nvsixలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 7 ఫిబ్రవరి, 2026న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశాలకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మహబూబాబాద్‌లో శ్రీ మహాలక్ష్మి గణపతి సేవా ట్రస్టు ఏర్పాటు చేసిన గోమయ వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

గోమయ గణనాథుడికి ప్రత్యేక పూజలు

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే మురళీనాయక్-ఉమ దంపతులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రం బస్టాండ్ సమీపంలో శ్రీ మహాలక్ష్మి గణపతి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గోమయ గణనాథుడి వద్ద శనివారం స్థానిక శాసన సభ్యుడు భూక్య మురళీనాయక్-ఉమ దంపతులు పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ... నియోజకవర్గ ప్రజలంతా అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని గణనాథుడిని వేడుకున్నట్లు తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం పురవీధుల్లో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఊరేగిస్తూ మున్నేరు వాగులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో శ్రీ మహాలక్ష్మి గణపతి సేవా ట్రస్టు బాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కొత్త గ్రూపులు

- కిషోర బాలికలు, వృద్ధులకు సంఘాలు
- లింగ, వయో బేధం లేకుండా దివ్యాంగులకు 'ఎస్‌హెచ్‌జీ'లు
- మిగిలిన మహిళలు కూడా గ్రూపుల్లోకి..
- విద్య, వైద్యం, రక్షణ, భవిష్యత్‌పై అవగాహన
- జిల్లాలో 17,328 మందితో 1,605 సంఘాల ఏర్పాటునకు సన్నాహాలు




కేసముద్రం స్టేషన్ జడ్పీ హైస్కూల్‌లో సమావేశమైన కిశోర బాలికలు

కేసముద్రం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక స్వావలంబన, పేదరిక నిర్మూలన కోసం కొనసాగుతున్న స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ) ఇక నుంచి కొత్త పంథాలో ఏర్పాటు కాబోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ మహిళా శక్తి' విధానంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పం చేపట్టింది. అయితే మహిళా సంఘాలతో పాటు అదనంగా అనుబంధ రంగాల్లోని వారిని, ఎలాంటి సంఘాల్లో లేని మహిళలను కూడా సభ్యులుగా కొత్త గ్రూపులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు 12-18ఏళ్ల కిశోర బాలికలు, 60 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులతో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నారు. గత ఏడాది జూలై నెలలో వరంగల్ జిల్లాలో 3,315 మంది కిశోర బాలికలతో 290 స్వయం సహాయక సంఘాలను పైలెట్ ప్రాజెక్టు కింద విజయవంతంగా ఏర్పాటు చేశారు. ఇదే తరహాలో మహబూబాబాద్ జిల్లాలోను కిశోర బాలికలతోపాటు దివ్యాంగులు, వృద్ధులతో గ్రూపులను ఏర్పాటు చేసేందుకు ఐకేపీ సిబ్బంది గ్రామాల్లో ప్రయత్నాలు ప్రారంభించారు. అలాగే ఇప్పటి వరకు ఏ గ్రూపులో లేని మహిళలకు సంఘాల్లో సభ్యత్వం కల్పించడం చేస్తున్నారు.



కేసముద్రం మండలంలో సంఘం ఏర్పాటుపై వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న సెర్ప్ సిబ్బంది

మా భవిష్యత్‌కు సంఘం ఉపయోగపడుతుంది



తనతోపాటు మరో పది మంది కలిసి కిశోర బాలికల సంఘాన్ని కొత్తగా ఏర్పాటు చేసుకున్నాం. విద్య, ఆరోగ్యం, రక్షణ, బ్యాంకింగ్, చట్టాలపై అవగాహన కల్పించడం మాకు ఎంతో అవసరం. ఈ సంఘాల ఏర్పాటుతో కిశోర బాలికల జీవన విధానాన్ని మెరుగుపరుస్తాయి. మా భవిష్యత్‌ను ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దుకునేందుకు ఈ సంఘాలు దోహదం చేస్తాయి. రాబోయే కాలంలో స్వయం సహాయక సంఘాలను ఎలా ఉపయోగించుకోవాలనేది ఈ సంఘాల ద్వారా తెలుస్తుంది.

\- కత్రోజు స్వస్తిక, కిశోర బాలికల సంఘం సభ్యురాలు, అమినాపురం

జిల్లాలో 17వేల మందితో 1,600 గ్రూపులు

మహబూబాబాద్ జిల్లాలో మూడు వర్గాలతోపాటు ఇప్పటి వరకు ఎస్‌హెచ్‌జీలో లేని మహిళలు 17,328 మందిని గుర్తించగా వీరితో 1,605 గ్రూపులను ఏర్పాటు కోసం గ్రామీణాభివృద్ధి శాఖలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందులో కిషోర బాలికలు 2,533 మంది ఉండగా 240 గ్రూపులను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అలాగే దివ్యాంగులు 1,704 మందికి 206 గ్రూపులు, వృద్ధులు 6,654 మందితో 582 గ్రూపులు, ఏ సంఘాల్లో లేని మహిళలు 6,437 మంది ఉండగా 577 గ్రూపులను ఏర్పాటు చేయనున్నాను. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 750 స్వయం సహాయక సంఘాలనుఏర్పాటు చేశారు. మిగిలిన సంఘాల ఏర్పాటుకు (మిగతా 8వ పేజీలో)

పొలానికి నీరు పెడుతుండగా..

విద్యుదాఘాతంతో రైతు మృతి

కురవి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కురవి మండలం స్టేషన్ గుండ్రాతిమడుగు గ్రామానికి చెందిన ఆలేటి సాయికుమార్(33) అనే రైతు శనివారం ఉదయం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... సాయికుమార్‌కు 1.10 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో వరిపంట సాగు చేశాడు. పొలానికి నీరు పెట్టేందుకు మోటార్‌ను ఆన్ చేయగా.. విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు సాయికుమార్‌ను ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని తెలిపారు. సాయికుమార్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై సతీష్ పేర్కొన్నారు.

హైందవ పరిరక్షణకు కృషి చేయాలి



పులిహోర పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

తొర్రూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మ పరిరక్షణకు యువత కృషి చేయాల్సిన అవసరం ఉందని వాసవీ క్లబ్ అధ్యక్షుడు చిదిరాల నవీన్‌కుమార్ అన్నారు. శనివారం తొర్రూరు పట్టణంలోని 10 వినాయక మండపాల వద్ద గత 9 రోజులుగా నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జరిగిన నిమజ్జనానికి పులిహోర ప్రసాద వితరణ కోసం పది క్వింటాళ్ల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాశ్చాత్య సంస్కృతి పెరుగుతున్న నేపథ్యంలో యువత హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేసి భక్తి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి సంవత్సరం గణపతి ఉత్సవాల నిర్వహణకు సహకారం అందిస్తున్నానని, మరింత సాకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఇమ్మడి రాంబాబు, నిరంజన్, సాయితేజ, మహేష్, నర్సుటి గజానంద్, గడల శ్రీను, వెంకన్న, ఏకాంతం, యాకన్న, కిరణ్ పాల్గొన్నారు.

'ఇన్‌స్పైర్'పై నో ఇంట్రెస్ట్

- విద్యార్థుల్లో పెరుగుతున్న అనాసక్తి
- ములుగు జిల్లా అంతంత మాత్రంగానే దరఖాస్తులు
- గడువు ముగియనున్నా పట్టించుకోని వైనం
- 112 పాఠశాలల్లో 28 శాతం మాత్రమే అర్జీలు

ములుగు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మేధాశక్తిని పెంచాలనే సర్కారు లక్ష్యం నీరుగారిపోతోంది. ఇన్‌స్పైర్ కార్యక్రమంపై విద్యార్థుల్లో అనాసక్తి పెరుగుతోంది. దరఖాస్తు చేసుకోవడానికి గడువు ముగింపు దశకు చేరుకున్న ఇంకా వందలాది మంది అందుకు మొగ్గుచూపడం లేదని తెలుస్తోంది.విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి వారిని ప్రోత్సహించడంతోపాటు శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడమే ఇన్‌స్పైర్ లక్ష్యం.

ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వం నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ద్వారా ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమాన్ని చేపడుతోంది. ఆరు నుంచి పదో తరగతి చదివే ప్రభుత్వ, ప్రైవేటు, పాఠశాలల విద్యార్థులతో పాటు గురుకులాల, ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్ తదితర పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చు. ములుగు జిల్లా విద్యార్థులు ఇందుకు అంతగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. దీంతో కేంద్ర ప్రభుత్వం నుంచి లభించే స్కాలర్‌షిప్‌లు, రీసెర్చ్ అవకాశాలు వృథా అవుతున్నాయని, దీంతో భవిష్యత్ తరాలు సైన్స్ పట్ల నిరాసక్తి చూపుతారేమోనని విద్యాతేత్తలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్హతలున్నా వెనకడుగు

ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్ (ఇన్‌స్పైర్) కార్యక్రమానికి ఒక్కో పాఠశాల నుంచి ఐదుగురు అర్హులైన విద్యార్థులను ఎంపిక చేయాలనే నిబంధన ఉంది. ఈ క్రమంలో ములుగు జిల్లాలో 112 పాఠశాలల్లో 560 మంది విద్యార్థులు అర్హులుగా ఉన్నారు. దరఖాస్తు ప్రక్రియ జూన్ 15 నుంచి ప్రారంభమైంది. మూడు నెలలవుతున్నా ఇప్పటి వరకు 29 పాఠశాలల నుంచి 157 మంది విద్యార్థులు మాత్రమే అప్లయ్ చేసుకున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇది మొత్తం అర్హుల సంఖ్యలో 28 శాతం మాత్రమే. మిగిలిన 83 పాఠశాలల విద్యార్థులు ఈ ప్రక్రియలో పాల్గొనకపోవడం, ఈ సదావకాశాన్ని పట్టించుకోక పోవడంపై దిగ్భ్రాంతి వ్యక్తమవుతోంది. విద్యార్థులు సోషల్‌మీడియా, డిజిటల్ గేమ్‌లలో మునిగిపోయి ఇలాంటి కీలక అవకాశాలను విస్మరిస్తున్నారనే ఆందోళన వ్యక్తమవుతోంది.

విద్యావేత్తల్లో ఆందోళన

ఇన్‌స్పైర్‌లో ఎంపికైన విద్యార్థులకు వారి ప్రాజెక్టుల తయారీ కోసం ప్రభుత్వం రూ. 10వేలు అందిస్తుంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ. 25 వేల బహుమతి ప్రదానం చేస్తుంది. జిల్లాలోని విద్యార్థులకు ఇన్‌స్పైర్ కార్యక్రమంపై ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించకపోవడంతో వారు నిరాసక్తి కనబరుస్తున్నారని తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ పథకంపై సరైన అవగాహన లేకపోవడం ఈ సమస్య మరింత తీవ్రంగా మారిందని చెప్పవచ్చు. పలు పాఠశాలల నిర్వాహకుల నిర్లక్ష్యం వల్ల కేంద్ర ప్రభుత్వం లక్ష్యం నీరగారిపోతోందని, అలాగే ఉపాధ్యాయులు పూర్తి స్థాయిలో విద్యార్థులకు ఈ పథకం పట్ల అవగాహన కల్పించకపోవడంతో దేశానికి భవిష్యత్ సైంటిస్టులను కోల్పోతున్నామని విద్యావేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌స్పైర్‌లో పాల్గొనేందుకు ఈనెల 15 వరకే చివరి గడువు. అయినా అంతంత మాత్రంగానే దరఖాస్తులు రావడం ఆందోళన కలిగిస్తోంది.

జీఎస్టీ రద్దుతో సామాన్య ప్రజలకు లబ్ధి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొన్ని వస్తువులపై వస్తు సేవల పన్ను(జీఎస్టీ) రద్దు, మరికొన్నింటిపై తగ్గింపు చేయడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు అన్నారు. మహబూబాబాద్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు మేలు జరిగేలా జీఎస్టీ తగ్గించడం చరిత్రాత్మక నిర్ణయమని చెప్పారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ప్రధాని మోదీ వన్ నేషన్, వన్ ట్యాక్స్ లాంటి సంస్కరణలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర సరుకుల ధరలు తగ్గనున్నాయని తద్వారా పేదలకే మేలు జరగనుందన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్‌గౌడ్ రూ.20,501లకు దక్కించుకున్నారని చెప్పారు. అనంతరం వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో గడ్డం అశోక్, గుగులోతు మదన్, పొదిల్ల నర్సింహారెడ్డి, ఓర్సు పద్మావతి, సతీష్, దారా ఇందుభారతి, సందీప్, రాధా పటేల్, కాంతమ్మ, వెన్నమల్ల అజయ్, రమేష్, జహేందర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు..

ఇద్దరికి గాయాలు

కాటారం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు పంచాయతీ కార్మికులు గాయపడిన సంఘటన భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని జాతీయ రహదారి 353(సీ)పై శనివారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం గ్రామ పంచాయతీ కార్మికులు తోట శేఖర్, పాడి సత్యంరాజు బైక్‌పై మహదేవపూర్‌కు బయల్దేరారు. అదే సమయంలో భూపాలపల్లి మండలంలోని గడ్డిగానిపల్లికి చెందిన వ్యక్తులు కారులో మహదేవపూర్ వెళ్తున్నారు. సబ్ స్టేషన్‌పల్లి సమీపంలో బైక్‌ను వెనకనుంచి కారు ఢీకొనడంతో శేఖర్ కాలు రెండు చోట్ల విరిగి తీవ్ర గాయాలయ్యాయి. సత్యంరాజుకు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108అంబులెన్స్‌లో భూపాలపల్లి 100పడకల ఆస్పత్రికి తరలించారు.

లంబాడీలు, ఆదివాసీల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్రలు

బీఆర్ఎస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తున్నాయి

యూరియా విషయంలో ఆందోళన వద్దు

మానుకోట ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లంబాడీలు, ఆదివాసీలకు మధ్య చిచ్చు పెట్టేందుకు కొంత మంది కుట్రలు పన్నుతున్నారని, వాటిని తిప్పికొట్టాలని మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటున్న ఆదివాసీ, లంబాడీల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. భద్రాచలం, ఉట్నూరులో బీఈడీ కళాశాలలు మంజూరీ అయ్యాయని, దాని విషయంలో ఆదివాసీ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మాట్లాడారని చెప్పారు. దానిని వక్రీకరించి లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని వారు కోరినట్లుగా సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. స్వయాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 5న లంబాడీ ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారని, 1976లో లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చింది మాజీ ప్రధాని ఇందిరాగాంధీ అని, అలాంటి కాంగ్రెస్ పార్టీ ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను ఎలా తొలగిస్తారని, తొలగించే ప్రసక్తే లేదని చెప్పారని వివరించారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని 2016లో నాడు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఎంపీ సోయం బాబురావు హైకోర్టులో కేసు వేస్తే దానిని కొట్టి వేయగా సుప్రీంకోర్టుకు వెళ్లారని, వారితో కూడా మాట్లాడి ఆ కేసును ఉపసంహరించుకునేలా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు.

యూరియా విషయంలో ఆందోళన వద్దు..

యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, ప్రతి రైతుకు యూరియా అందుతుందని స్థానిక ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. యూరియా కొరత ఒక్క తెలంగాణలోనే కాదని, అన్ని రాష్ట్రాల్లో ఉందని, నాగార్జున యూరియా మేనేజ్‌మెంట్ మారడం, రామగుండంలో పరిశ్రమ దెబ్బతినడం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, చైనా నుంచి దిగుమతి కాకపోవడం లాంటి కారణాలతో యూరియా కొరత ఏర్పడిందని చెప్పారు. కేంద్రం నుంచి 8లక్షల మెట్రిక్ టన్నులు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 5లక్షల మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. మిగతాది కూడా త్వరలో రానుందని, అందరికి యూరియా అందుతుందని చెప్పారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నీరుటి లక్ష్మీనారాయణ, ఖలీల్‌పాషా, బానోత్ ప్రసాద్, ఎడ్ల రమేష్, సల్వాది దిలీప్, ప్రభాకర్, బాలాజీ, చంటి, పాషా, శ్రీను, సిద్ధు పాల్గొన్నారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

వెంకటాపురం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లంబాడీలను ఎతఈస్ట జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో శనివారం జరగ్గా ముఖ్య అతిథిగా సతీష్ హాజరయ్యారు. లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల ఆదివాసీలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఆదివాసీలకు దక్కాల్సిన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను లంబాడీలు లాక్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు కృష్ణబాబు, శంకర్, నాగరాజు, రఘు, రాజుకుమార్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయంలో ఈఎన్‌సీ పూజలు



ఈఎన్‌సీని సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

మహదేవపూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ నంగునూరి అశోక్ దంపతులు శనివారం దర్శించుకున్నారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికగా స్వామివారికి అభిషేకం చేశారు. పార్వతీ శుభానంద దేవి అమ్మవారి ఆలయంలో పూజల అనంతరం అర్చక స్వాములు, వేద పండితులు స్వామివారి శేష వస్త్రాలతో వారిని సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడని..

● కిడ్నాప్ చేసి యువకుడి దారుణ హత్య ● ఆరుగురు నిందితుల అరెస్టు ● భూపాలపల్లిలో బాసిత్ హత్య కేసులో వీడిన మిస్టరీ



నిందితుల అరెస్టును చూపుతున్న డీఎస్పీ సంపత్‌రావు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో మేడారం అడవుల్లో శుక్రవారం వెలుగు చూసిన యువకుడి హత్య కేసును భూపాలపల్లి పోలీసులు ఛేదించారు. ఆరుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. తమకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడనే కోపంతో ఆ యువకుడిని కిడ్నాప్ చేసి కత్తితో పొడిచి హత్య చేశారని, ఆపై పెట్రోల్ పోసి నిప్పంటించారని గుర్తించారు. భూపాలపల్లి డీఎస్పీ అవిర్నేని సంపత్‌రావు తన చాంబర్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధి రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన ఎం.డి.బాసిత్ (20)తో శాంతినగర్ కాలనీకి చెందిన రడపాక భాస్కర్ అలియాస్ బబ్లూ, బుస్స ప్రశాంత్ అలియాస్ సోను, గాజుల కుషాల్ అనే యువకులకు గొడవలు ఉన్నాయి. రెండు నెలల క్రితం బస్టాండ్ ఎదురుగా వీరు ఓ విషయంలో వాగ్వాదం చేసుకున్నారు. ఆ సమయంలో బాసిత్ అసభ్యకరంగా మాట్లాడాడని ఆ యువకులు అతడిని చితకబాదారు. దీంతో బాసిత్ వారిపై కక్ష పెట్టుకుని సోషల్ మీడియాలో హేట్ మేసేజ్‌లు పెట్టడం మొదలెట్టాడు. ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లో అసభ్యకర పదజాలంతో వారికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టడమేకాకుండా నేరుగా మేసేజ్ రూపంలో రెచ్చగొట్టే విధంగా వారికి పంపేవాడు. దీంతో కోపోద్రిక్తులైన ముగ్గురు బాసిత్‌ను అంతమొందించాలని పథకం రచించారు. తమ మరో ముగ్గురు స్నేహితులు పందిళ్ల శ్రవణ్, బరిగల ప్రణయ్, చొప్పరి నవీన్‌తో కలిసి మర్డర్‌కు ప్లాన్ చేశారు. ఈ నెల 4న తన మిత్రుడు అరుణ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై బాసిత్ వస్తుండగా ఆరుగురు కారులో వచ్చి అతడిని ఆపి కొట్టారు. ఆపై కారులో ఎక్కించుకొని కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు.

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవుల్లోకి తీసుకెళ్లి విచక్షణ రహితంగా కొట్టి చేతులు వెనక్కి కట్టేసి కత్తితో పొడిచారు. చనిపోయాడని నిర్ధారించుకున్నాక తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ని పోసి నిప్పటించి పరారయ్యారు. ఈ నేపథ్యంలో ఈనెల 5న మృతదేహాన్ని తాడ్వాయి పోలీసులు గుర్తించారు. అప్పటికే కిడ్నాప్ కేసు భూపాలపల్లిలో నమోదై ఉన్న నేపథ్యంలో అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో మృతుడితో కిడ్నాప్ రోజు ఉన్న అతడి స్నేహితుడు చెప్పిన వివరాలు, సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించిన భూపాలపల్లి పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. నేరాన్ని వారు అంగీకరించడంతో రిమాండ్‌కు తరలించారు.

అరెస్టు అయిన వారిలో భూపాలపల్లి పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన రడపాక భాస్కర్ అలియాస్ బబ్లూ, బుస్స ప్రశాంత్ అలియాస్ సోను, గాజుల కుషాల్, టీటూ క్వార్టర్స్‌కు చెందిన పందిళ్ల శ్రవణ్ అలియాస్ పవన్, యాదవకాలనీకి చెందిన బరిగల ప్రణయ్, సుభాష్‌కాలనీకి చెందిన చొప్పరి నవీన్ ఉన్నారని డీఎస్పీ వివరించారు. విలేకరుల సమావేశంలో సీఐ నరేష్‌కుమార్, ఎస్సైలు సాంబమూర్తి, రమేష్‌లు పాల్గొన్నారు. మృతుడు బాసిత్ ఏపనీ చేయకుండా తిరిగే వాడని, అతడిపై పలు గంజాయి, చైన్‌స్నాచింగ్ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

ఎస్సార్‌యూకు ఆల్ ఇండియా 91వ ర్యాంకు

- ఎన్ఐఆర్ఎఫ్ కేటగిరిలో కైవసం
- ఎస్సార్‌యూ చాన్స్‌లర్ వరదారెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న ఎస్సార్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ వరదారెడ్డి

హసన్‌పర్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం మరోసారి తన ప్రతిభను చాటుకుందని ఎస్సార్ విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. మండలంలోని అనంతసాగర్ ఎస్సార్‌యూలో శనివారం ఎస్సార్‌యూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వరదారెడ్డి వివరాలను వెల్లడించారు. ఇటీవల విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ 2025ను విడుదల చేశారని తెలిపారు. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ (ఎంఓఈ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)-2025లో ఇంజనీరింగ్ కేటగిరిలో 91వ ర్యాంకు, యూనివర్సిటీ కేటగిరిలో 101- 150 బ్యాండ్లో స్థానం సంపాదించడం గర్వకారణమన్నారు. తెలంగాణలోని ప్రైవేటు సంస్థలలో ఇంజనీరింగ్ కేటగిరిలో టాప్ 100లో స్థానం పొందిన ఏకైక సంస్థ ఎస్సార్‌యూ మాత్రమేనని అన్నారు. వరుసగా నాలుగో సంవత్సరం ఈ ప్రతిష్ఠాత్మక ర్యాంకు దక్కించుకోవడంలో విశ్వవిద్యాలయ అధ్యాపక బృందం, విద్యార్థుల కృషి మరువలేనిదన్నారు.

వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ.. ఇంజనీరింగ్‌లో టాప్ 100లో చోటు దక్కించుకోవడం ద్వారా విద్యా నాణ్యత, పరిశోధన ఆవిష్కరణలపై ఎస్సార్ విశ్వవిద్యాలయం పట్టును మరోసారి రుజువు చేసుకుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రైవేటు విశ్వవిద్యాలయాల మధ్య ఎస్సార్ విశ్వవిద్యాలయం అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఇన్నోవేషన్, క్రియేటివిటీ, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ విలువలను పాఠ్యాంశంలో భాగంగా చేసుకోవడంతో పాటు అధ్యాపక బృందం, సమర్థవంతమైన పరిశోధన ఫలితంగా 5000 ప్లస్, పరిశోధన పత్రాలు, 1000 ప్లస్ పేటెంట్లు, 50 ప్లస్ పేటెంట్లు పొందినట్లు తెలిపారు. 50 ప్లస్ పరిశోధన ప్రాజెక్టుల ద్వారా రూ.15 కోట్ల నిధులు అలాగే మైక్రోసాఫ్ట్ నుంచి 51 ఎల్‌పీఏ వంటి అత్యుత్తమ ప్లేస్‌మెంట్ అవకాశాలు సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వి.మహేష్, రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి, వివిధ స్కూల్స్ డీన్స్, వివిధ విభాగాల హెడ్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.



రామప్ప ఆలయ గార్డెన్‌లో వ్యర్థాలు

రామప్ప గార్డెన్‌లో చెత్తాచెదారం

వెంకటాపూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ గార్డెన్‌లో చెత్తాచెదారం దర్శనమిస్తోంది. ప్రపంచ దేశాల నుంచి పర్యటకులు వస్తున్నప్పటికీ శుభ్రత విషయంలో ఇక్కడ శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్ల రామప్ప గార్డెన్ ప్లాస్టిక్ వ్యర్థాలతో శనివారం ఉదయం దర్శనమిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఖ్యాతి పొందిన ఆలయం పట్ల అధికారులు ఇలా నిరక్ష్యం వహిస్తున్నారని పర్యాటకులు విమర్శిస్తున్నారు. శోభాయమానంగా వెలుగొందాల్సిన రామప్ప దేవాయ గార్డెన్ చెత్తతో దర్శనమివ్వడమేమిటని ప్రశ్నిస్తున్నారు.

ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనోత్సవం

● రెండో రోజు కూడా కొనసాగిన వేడుక ● తరలివచ్చిన భారీ విగ్రహాలు ● చిన్నవడ్డేపల్లి, ఉర్సు, బెస్తం చెరువుల వద్ద అధికారుల వైఫల్యం
● మొదటి రోజు అర్ధరాత్రి వరకే కనిపించిన వైనం మొరాయించిన క్రేన్లు.. లోతు లేక నీటమునగని విగ్రహాలు


ఉర్సు చెరువు వద్ద ఒడ్డునే నిమజ్జనాలు చేసిన గణపతి విగ్రహాలు


చిన్నవడ్డెపల్లికి ట్రాక్టర్లపై పెద్ద ఎత్తున నిమజ్జనానికి తరలివస్తున్న వినాయక విగ్రహాలు


చిన్న వడ్డెపల్లి చెరువుకు తరలుతున్న భారీ విగ్రహం

పోచమ్మమైదాన్(వరంగల్), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా ముగిసాయి. శుక్రవారం ఉదయం ప్రారంభమైన నిమజ్జన వేడుకలు శనివారం సాయంత్రం వరకు కొనసాగాయి. గణేష్ ఉత్సవ నిర్వాహకులు చాల ఆలస్యంగా రోడ్ల పైకి వచ్చారు. దీంతో అర్ధరాత్రి వరకు నిమజ్జన వేడుకలు నిమ్మదిగా సాగాయి. ఇదిలావుండగా, వరంగల్ దేశాయిపేటలోని చిన్న వడ్డెపల్లి చెరువులో అర్ధరాత్రి 1 గంట వరకు సుమారుగా 800లోపు మాత్రమే విగ్రహాల నిమజ్జనం జరిగింది. కాగా అర్ధరాత్రి రెండు గంటల తరువాత అధికశాతం విగ్రహాలు నిమజ్జనానికి బయలు దేరి వచ్చాయి. దీంతో రెండవ రోజు సాయంత్రం వరకు వినాయక నిమజ్జనం నిర్విరామంగా కొనసాగింది. శనివారం ఉదయం వేళలో నిమజ్జనానికి వచ్చిన విగ్రహాల వాహనాలు సుమారు మూడు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. దీంతో పోలీసులు వాహనాలను క్రమపద్ధతిలో చెరువు వద్దకు చేరవేశారు.

చిన్నవడ్డెపల్లి చెరువులో రెండు రోజులు జరిగిన కార్యక్రమంలో చిన్న విగ్రహాలు 500, మీడియం సైజు విగ్రహాలు 400, బారీ విగ్రహాలు 700 వరకు నిమజ్జనమైయ్యాయని, మొత్తంగా సుమారు 1600 విగ్రహాల నిమజ్జనం జరిగినట్లు అధికారులు తెలిపారు. అధిక శాతం విగ్రహాలు ఆలస్యంగా బయలు దేరడం, కొన్ని మండపాల నిర్వాహకులు ఉదయం బయలుదేరడంతో రెండవ రోజు సాయంత్రం వరకు వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగింది. మధ్యాహ్నం మూడు గంటల తరువాత క్రేన్ ఆపరేటర్లు అందుబాటులో లేకపోవడంతో పలువురు మండపాల నిర్వాహకులు నేరుగా విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేశారు. కాగా సాయంత్రం వేళలో భారీ విగ్రహాలు నిమజ్జనానికి రావడంతో మళ్లీ క్రేన్‌లతో నిమజ్జనం చేశారు.

కొరవడిన పర్యవేక్షణ....

వినాయక నిమజ్జన వేడుకలలో అర్ధరాత్రి దాటిన తరువాత పూర్తి స్థాయిలో అధికారుల పర్యావేక్షణ కొనసాగలేదు. అధికారులు కనబడకపోవడంతో సిబ్బంది చేతుల మీదుగానే నిమజ్జన ప్రక్రియ కొనసాగినట్లు పలువురు తెలిపారు. తెల్లవారుజాము నుంచి అధిక శాతం విగ్రహాలు నిమజ్జనానికి రావడంతో కొంత ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. కేవలం పోలీసు సిబ్బంది మాత్రమే విధుల్లో ఉండటంతో నిమజ్జనం చేసే క్రేన్‌ల వద్ద విగ్రహాల వాహనాలు భారీగా మోహరించాయి.


నిమజ్జనానికి సిద్ధంగా ఉన్న గణపతి

చేతులెత్తేసిన సిబ్బంది...

కరీమాబాద్(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉర్సు గుట్ట చెరువు వద్ద శుక్రవారం రాత్రి నిర్వహించిన గణపతి నిమజ్జనాల్లో సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారు. శుక్రవారం రాత్రి 11 గంటల వరకు సుమారు 600పైగా విగ్రహాల వరకు సాఫీగా సాగిన నిమజ్జనాలు ఆ తరువాత గతి తప్పాయి. నిమజ్జనాల కోసం ఏర్పాటు చేసిన మూడు క్రేన్‌లు మొరాయించడంతో విగ్రహాలను చెరువులోకి తరలించడం కష్టతరం కావడంతో సిబ్బంది చెరువులోకి తెప్పలు వెళ్లడం కష్టమని విగ్రహాలను ఒడ్డున ఉన్న ప్లాట్‌ఫాం దగ్గరే నిమజ్జనం చేశారు. దీంతో విగ్రహాలు సగం వరకే నీటిలో మునిగిపోయాయి. ఆ తరువాత వచ్చే విగ్రహాలను చెరువులో నిమజ్జనం చేసేందుకు వీలు లేకపోవడంతో భక్తులకు, సిబ్బందికి మధ్య కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఒక్కో గణపతి విగ్రహం నిమజ్జనం చేసేందుకు గ్రేటర్ సిబ్బంది రూ.500 డిమాండ్ చేసినట్లుతెలిసింది. నిమజ్జనాల ఏర్పాట్లలో జీడబ్ల్యూఎంసీ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపణలు వచ్చాయి. నిమజ్జనాలు గతి తప్పిన విషయంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. శనివారం సాయంత్రం కూడా నిమజ్జనాలకు గణపతి విగ్రహాలు తరలివచ్చాయి. కాని చెరువు ప్రాంతంలో కేవలం ఒకే ఒక్క క్రేన్ అందుబాటులో ఉండగా, సిబ్బంది ఎవరూ కనిపించలేదు.

బెస్తం చెరువు వద్ద అదే పరిస్థితి...

శంభునిపేట (ఆంధ్రజ్యోతి): రంగశాయిపేట నాయుడు పెట్రోల్ పంప్ సమీపంలోని బెస్తం చెరువులో నిమజ్జన ఏర్పాట్లు చేయడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారు. నిమజ్జనం కోసం నాలుగు రోజుల క్రితం చెరువులో నామమాత్రంగా పూడిక తీసారు. సుమారు 250 విగ్రహాలు నిమజ్జనం చేసే చెరువులో ఆ స్థాయిలో పనులు చేయలేకపోయారు. దీంతో లోతు లేక విగ్రహాలు నీట మునగలేదు. ఈ క్రమంలో గణనాథులను క్రేన్ నుంచి దింపి తెప్పలలో 30 మీటర్ల దూరం వరకు లోతున్న ప్రాంతానికి తీసుకెళ్ళి నిమజ్జనం చేయాల్సి వచ్చింది. దీంతో చెరువు వద్ద నుండి ఖమ్మం రోడ్ వరకు విగ్రహాలు గంటల కొద్దీ బారులు తీరాయి. కొన్ని పెద్ద విగ్రహాలను చెరువు పక్కనే నిమజ్జనం చేయగా అవి మునగకపోవటంతో ఆయా మండళ్ల బాధ్యులు ఇరిగేషన్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. మామునూరు ఎస్ఐ శ్రీకాంత్ సముదాయించి నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చూశారు.

ఘనంగా ఆంధ్రజ్యోతి గణపతి నిమజ్జన వేడుక


ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో వినాయక నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న ఆంధ్రజ్యోతి బృందం

మడికొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నవరాత్రులు ఘనంగా పూజలందుకున్న విఘ్న వినాయకుడిని ఆంధ్రజ్యోతి సిబ్బంది శుక్రవారం రాత్రి ఘనంగా సాగనంపారు. మడికొండలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ వి.రఘుపతిరావు ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది వినాయక నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది 18వ సారి కావడం విశేషం. శుక్రవారం రాత్రి స్వామి వారికి ఉద్వాసన పూజను భక్తిపాటలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్‌మేనేజర్ వివిధ విభాగాల ఇన్‌చార్జిలను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. సంస్థ పురోభివృద్ధితో పాటు, సిబ్బంది సంక్షేమం కాంక్షిస్తూ వినాయక నవరాత్రులు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఉత్సాహంగా సాగిన వేలం పాటలో లడ్డూను ప్రొడక్షన్ విభాగం రీజనల్ మేనేజర్ బి.అజయ్‌కుమార్ దక్కించుకున్నారు. అనంతరం ఆటపాటలతో ఊరేగింపు నిర్వహించి శనివారం తెల్లవారుజామున మడికొండ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిషన్ ఇన్‌చార్జి శంకర్‌రావు శెంకేసి, యాడ్స్ మేనేజర్ రమేశ్, సర్క్యులేషన్ ఇన్‌చార్జి షరీఫ్, అకౌంటెంట్ ఎస్.వెంకటేశ్, స్టోర్స్ రవి, ప్రొడక్షన్ నుంచి విజయ్, షెడ్యూలింగ్ కాయల వేణయ్య, హెచ్ఆర్ రాజేందర్, సబ్ ఎడిటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

శివనగర్‌లో లడ్డూ వేలం పాట రూ.1.36 లక్షలు


వేలంపాటలో లడ్డును పొందిన మెరుగు అశోక్

ఖిలావరంగల్, సెప్టెంబర్ 6(ఆంధ్రజ్యోతి): వరంగల్ శివనగర్‌కు చెందిన మెరుగు అశోక్ రూ.1,36,500కు వేలంలో వినాయక లడ్డూ దక్కించుకున్నారు. 34వ డివిజన్ శివనగర్‌లో రాక్‌స్టార్ ఏర్పాటు చేసిన లడ్డూకు శుక్రవారం రాత్రి వేలం పాట నిర్వహించగా అశోక్ అత్యధిక పాటపాడి కైవసం చేసుకున్నారు. ఆయనకు వాస్తు వేదాంతి సుమన్‌శర్మ లడ్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో రాక్‌స్టార్ యూత్ సభ్యులు అంకతి అఖిల్, నలివేల మహేష్, పిన్నిరెడ్డి ప్రణీత్‌రెడ్డి, గుండెపు శివ, ఏకాంబరం మనస్విత్, ముప్పార పాకిల్, నిఖిల్, గూడురు రాజేష్, సంతోష్, సాత్విక్, అరవింద్, కిట్టు, స్థానిక పెద్దలు దిడ్డి రాజేందర్, కోటి నారాయణ, అచ్చ రవి, బేతి శ్రీకివాస్ తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జనాన్ని తిలకిస్తున్న భక్తులు, ఫైర్ ఇంజన్‌తో గణపతిపై నీళ్లు చిమ్ముతున్న దృశ్యం

భారీ గణనాథుడికి జన నీరాజనం

ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం చేసిన నిర్వాహకులు

5గంటల పాటు కొనసాగిన వేడుకలు

మట్టెవాడ సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎల్లంబజార్ ప్రాంతంలో ప్రతిష్ఠించిన 45 అడుగుల ఎత్తైన భారీ మట్టి వినాయకుడిని శనివారం ప్రతిష్ఠించిన చోటే నిమజ్జనం చేశారు. ఫైర్‌ఇంజన్ ట్యాంకర్, మున్సిపల్ వాటర్ ట్యాంకు నీళ్ళను విగ్రహంపై చిమ్మి నిమజ్జనం చేశారు. దీనికి దాదాపు ఐదు గంటల సమయం పట్టింది. దీంతో క్రమక్రమంగా మట్టి కరిగిపోయింది. నిమజ్జనాన్ని చూసేందుకు భక్తులు తరలివచ్చారు.

-రూ.3.26 లక్షల పలికిన లడ్డూ వేలం..

వరంగల్ ఎల్లంబజార్‌లో ఆకుతోట సంజు ప్రతిష్ఠించిన 45 అడుగుల ఎత్తైన భారీ గణనాధుని వద్ద ఏర్పాటు చేసిన లడ్డూను హంటర్‌రోడ్డుకు చెందిన బత్తిని సమత రమేశ్ దంపతులు దక్కించుకున్నారు. వేలం పాటలో పాల్గొని రూ. 3.26 లక్షలకు లడ్డూను గెలుచుకున్నారు.

మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైన నిమజ్జనం ప్రక్రియ సుమారు 5గంటలకు పైగా సాగింది. 200 లీటర్ల పాలు, 20 వేల లీటర్ల నీళ్ళు, 50కిలోల పసుపు, 50 కిలోల కుంకుమ, 30కిలోల పెరుగు, 80 కేజీల గులాబీ పూలతో నిమజ్జనం చేపట్టారు. వరంగల్ జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీధర్‌రెడ్డి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నవీన్‌ల ఆధ్వర్యంలో ఫైర్‌సిబ్బంది ట్యాంకర్ పైపుల సహాయంతో విగ్రహంపైకి నీళ్ళను చల్లి నిమజ్జనం చేశారు. నిమజ్జనం చేసిన మట్టిని భక్తులకు అందచేస్తామని నిర్వాహకుడు సంజు తెలిపారు.

10వేల పైచిలుకు విగ్రహాల నిమజ్జనం

● 36 గంటల పాటు శ్రమించిన బల్దియా సిబ్బంది

● జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని 22 చెరువుల వద్ద శనివారం మధ్యాహ్నం 2 గంటల వరకు 10వేలకు పైచిలుకు వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నగరంలో చాలాచోట్ల ఆలస్యంగా శోభయాత్రలు నిర్వహించడం వల్ల చిన్నవడ్డెపల్లి చెరువు వద్ద కొంత ఇబ్బంది ఏర్పడిందని తెలిపారు. అదనంగా సిబ్బందిని పిలిపించి ఆలస్యంగా వచ్చిన విగ్రహాలను నిమజ్జనం చేశామన్నారు. కిందటేడు 6,500 విగ్రహాలతో పోల్చుకుంటే.. ఈ యేడు విగ్రహాల సంఖ్య భారీగా పెరిగిందన్నారు. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ అన్ని విభాగాలు చెరువుల వద్ద విస్తృత సేవలందించడం వల్ల నిమజ్జన కార్యక్రమం విజయవంతమైందని వెల్లడించారు. 36గంటల పాటు సిబ్బంది శ్రమకోర్చి సేవలందించారని కమిషనర్ ప్రశంసించారు. సిబ్బంది సేవలను గుర్తించి వారికి తగిన అవకాశాలు ఇస్తామని కమిషనర్ తెలిపారు.

నేడు కాళేశ్వర ఆలయం బంద్

మహదేవపూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయాన్ని మూసివేయనున్నారు. ఉదయం 12 గంటలకు ద్వార బంధనం చేసి తిరిగి సోమవారం సంప్రోక్షణాది పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈవో మహేష్ తెలిపారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు భక్తులకు దర్శనానికి అనుమతించడం జరుగుతుందన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. బ్యారేజీలోకి 4.51లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. కాగా బ్యారేజీ వద్ద నీటి మట్టం 5.70మీటర్లు ఎత్తులో ప్రవహిస్తుంది.

మా సార్‌ను ఎక్కడికి పంపొద్దు..

● ప్రిన్సిపాల్ డిప్యూటేషన్‌ను రద్దు చేయాలి ● మధ్యాహ్నం వరకు విద్యార్థినుల బైఠాయింపు
● కలెక్టర్ హామీతో శాంతించిన విద్యార్థినులు ● స్టేషన్‌ఘన్‌పూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఘటన


విద్యార్థినులకు నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్న అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమను తండ్రిలా, ఆదరిస్తూ, ఐదేళ్లుగా కంటికిరెప్పలా చూసుకుంటున్న ప్రిన్సిపాల్ ధరావత్ రాజును డిప్యూటేషన్‌పై పంపిస్తే పురుగుల మందు తాగుతామని, సార్ లేకుంటే మేం చదువుకోం టీసీలు ఇవ్వండి అంటూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన శనివారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చోటు చేసుకుంది. ఇటీవల పాఠశాల హాస్టల్‌లో ఉంటున్న ఓ టీచర్ విద్యార్థినులతో పాలు కాయించడం, అంట్లు తోమించడంతో పాటు, ప్రిన్సిపాల్ గదిలో విద్యార్థులను మోకాళ్ల పైన నిలబెట్టిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటనపైన అధికారులు విచారణ జరిపి ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌కు నివేదిక పంపించారు. నివేదిక మేరకు పీవో ప్రిన్సిపాల్ రాజును డిప్యూటేషన్‌పై అరెపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలకు పంపించారు. దీంతో ప్రిన్సిపాల్ రాజు ఘన్‌పూర్ ఆశ్రమ పాఠశాలకు వచ్చి డిప్యూటేషన్‌పై వెళ్తున్నట్టు ఉపాధ్యాయ బృందానికి తెలిపి వెళ్లిపోయారు. తర్వాత విషయం తెలుసుకున్న విద్యార్థులు కన్నీరుపెట్టుకున్నారు. ఈ క్రమంలోనే గేటు ఎదుట బైఠాయించారు. విద్యార్థులు రోడ్డు పైకి వెళ్లే ప్రయత్నం చేయగా సిబ్బంది గేటుకు తాళం వేశారు. దీంతో పాఠశాల ఆవరణలోనే గేటు వద్ద బైఠాయించి, మధ్యాహ్నం భోజనం టైం వరకు సార్‌ను పంపించొద్దు అంటూ నినాదాలు చేశారు. ఏ సమస్య వచ్చినా పరిష్కరించేవారని, సార్ వెళ్లితే తాము ఇక్కడ చదువమని, టీసీలు ఇస్తే వెళ్లిపోతామని విద్యార్థులు వెల్లడించారు. డిప్యూటేషన్ రద్దు చేయకుంటే పురుగుల మందు తాగుతామంటూ హెచ్చరించారు.

కలెక్టర్ హామీతో..

విషయం తెలుసుకున్న ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ వేణు, ఎస్సై వినయ్‌కుమార్‌లు పాఠశాలకు చేరుకుని విద్యార్థులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. నెల రోజుల్లో సార్‌ను తీసుకువచ్చేలా చూస్తామని పేర్కొన్నా వినలేదు. దీంతో ఆర్డీవో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడి ప్రిన్సిపాల్ డిప్యూటేషన్ తమ పరిధిలో లేదని, పీవోతో మాట్లాడి నెల రోజుల వ్యవధిలో తీసుకువచ్చేలా కృషి చేస్తామని విద్యార్థులకు తెలియపరుచాలని ఆర్డీవోకు తెలిపారు. దీంతో విద్యార్థులు శాంతించి, హాస్టల్‌కు వెళ్లి భోజనం చేశారు.

సర్కారు ఆఫీసుల్లో సౌర వెలుగులు

● ప్రతీ ఆఫీసు భవనంపై సోలార్ ప్యానెల్స్
● ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో సైతం..
● ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూముల్లో సోలార్ పంపుసెట్లు
● కరెంట్ బిల్లులు తగ్గించే దిశగా చర్యలు
● ప్రభుత్వ కార్యాలయాలపై కొనసాగుతున్న సర్వే
● నివేదికలు అందగానే సౌర పలకల బిగింపు

హనుమకొండ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ జల, థర్మల్ విద్యుత్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి సౌర విద్యుత్తును అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ పంచాయతీ భవనం నుంచి సచివాలయం వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే విషయమై ఇటీవల ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోలార్ విద్యుత్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. సోలార్ పవర్ ప్లాంట్లపై కలెక్టర్లు పంపాల్సిన వివరాలతో ఒక ప్రశ్నావళిని రూపొందించారు. నీటిపారుదల శాఖ, రోడ్లు, భవనాల శాఖల పరిధిలో పెద్ద ఎత్తున ఉన్న ఖాళీ భూముల వివరాలను సైతం ప్రభుత్వం సేకరిస్తోంది. వీటిలో కూడా సౌర వ్యవస్థలను ఏర్పాటు చేస్తారు.

అన్ని ప్రభుత్వ భవనాలపై..

విద్యుత్పత్తిలో ఎదురవుతున్న సమస్యలు, ఆర్థిక నష్టాలు, డిస్కంలకు బిల్లుల చెల్లింపులు భారమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయలను అన్వేషిస్తోంది. ప్రైవేటుగా భవనాలపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకునేందుకు ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రాయితీలను కల్పిస్తున్నది తెలిసిందే. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ దిశగానే అడుగులు వేస్తోంది. దాదాపు ఇలాంటి పథకాన్నే అమలు చేయాలని నిర్ణయించింది. అయితే ఇది పూర్తిగా ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితమైన కార్యక్రమం. ప్రతీ ప్రభుత్వ కార్యాలయం భవనంపై సౌరపలకలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని సొంత భవనాలు కలిగిన అన్ని ప్రభుత్వ, ప్రభుత్వరంగ కార్యాయాల భవనాలపై వీటిని ఏర్పాటు చేయాలని పేర్కొన్నది. దీంతో తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీజీ రెడ్కో) అదికారుల పర్యవేక్షణలో సర్వే జరుగుతోంది. మండలాల్లో ఎంపీడీవోలు, ఎన్‌పీడీసీఎల్ ఏఈలు, మున్సిపాలిటీల పరిధిలో ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజనీర్లు, డిప్యూటీ కమిషనర్లు సర్వే జరుపుతున్నారు. వాస్తవానికి ఈ సర్వే గత నెల 18వ తేదీ నాటికే పూర్తి కావలసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వర్షాలు కురుస్తుండడంతో సర్వే చేయడంలో జాప్యం జరుగుతోంది. రెండు మూడు రోజుల్లో సర్వే పూర్తి కావచ్చునని తెలుస్తోంది.



సమగ్రంగా సర్వే

పంచాయతీ భవనాలు, ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్ డిగ్రీ కళాశాలల భవనాలు, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, ఆస్పత్రులు, సాగునీటి ప్రాజెక్టు కార్యాలయాలు, కలెక్టరేట్ భవన సముదాయాలతో సహా ప్రతీ ప్రభుత్వ కార్యాలయంపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు. ఎన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఉన్నాయి? వాటి రూఫ్‌టాప్‌పై ఎన్ని కిలోవాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు, అందుకు ఎంత సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయవచ్చు? ఆ కార్యాలయానికి నెలకు ఎన్ని యూనిట్లు విద్యుత్ అవసరమవుతున్నది? ఎన్ని కిలోవాట్ల లోడు పడుతున్నది? తదితర వివరాలను సర్వే సందర్భంగా సేకరిస్తున్నారు. సర్వే పూర్తయిన తర్వాత నివేదికలను రెడ్కోకు అందజేస్తారు. రెడ్కో అధికారులు ఈ నివేదికలను పరిశీలించి ఎన్ని సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలి? ఎంత సౌరశక్తిని ఉత్పత్తి చేయాల్సిన అవసరం ఉంటుంది..? తదితర గణాంకాలతో ప్రతిపాదనలు రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ప్రభుత్వం ఈ మేరకు ప్రతిపాదనలు ఆమోదించి బడ్జెట్ కేటాయిస్తే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తారు. డిసెంబర్ నెలాఖరునాటికి అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలన్నది లక్ష్యం.

అవసరాన్ని బట్టి ప్లాట్లు

తక్కువ విద్యుత్ వినియోగం ఉన్న కార్యాలయాలకు ఎల్‌టీ సర్వీస్ కింద, విద్యుత్ వినియోగం ఎక్కువగా వినియోగించే భవన సముదాయాలకు హెచ్‌టీ సర్వీస్ కింద సోలార్ ప్లాంట్లను బిగిస్తారు. ఉదాహరణకు ఒక గ్రామ పంచాయతీ కార్యాలయానికి నెలకు రూ.2వేల కరెంట్ బిల్లు వస్తుంది అనుకుంటే అందుకు ఎల్టీ సర్వీసు కింద 3-5 కిలోవాట్ల సామర్థ్యంతో కూడిన సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తారు. కలెక్టరేట్ సముదాయ భవనం, పెద్దాస్పత్రుల వంటి విశాలమైన భవనాలకు హెచ్‌టీ సర్వీసు కింద 100 కిలోవాట్లకు పైగా సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను బిగిస్తారు.

సౌరగిరి జల వికాస పథకం

ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్‌ఓఎఫ్‌ఆర్ చట్టం కింద పంపిణీ చేసిన సుమారు 50వేల ఎకరాల్లో ఇందిర సౌరగిరి జల వికాస పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నారు. మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో వీటిని పంపిణీ చేయనున్నారు. అమ్మ ఆదర్శ కమిటీల కింద ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 130 ప్రభుత్వ పాఠశాలల భవనాలపై సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. మారుమూల పల్లె ప్రాంతాల్లోని కొన్ని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో సోలార్ హీటర్లను కూడా బిగించారు.

విద్యుత్ ఖర్చు ఆదా కోసమే..

ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బిల్లులు ప్రతీ నెల తడిసి మోపెడవుతున్నాయి. డిస్కమ్‌లకు ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఈ బకాయిలు రూ.600కోట్ల వరకు ఉన్నాయి. కార్యాలయాల్లో సౌరవిద్యుత్ అందుబాటులోకి వస్తే బకాయిల భారం చాలా వరకు తగ్గుతుంది. ప్రభుత్వానికి ఈ డబ్బు ఆదా అవుతుంది.

ప్రభుత్వ కార్యాలయాల సర్వే జరుగుతున్నది..

గంగుల మహేందర్ రెడ్డి, జిల్లా మేనేజర్, టీజీ రెడ్కో

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు సర్వే జరుగుతోంది. ఎల్‌టీ, హెచ్‌టీ సర్వీసులు ఎన్ని ఉన్నాయి. ఎన్ని కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లు అవసరమో ప్రతిపాదనలు సమర్పించి ప్రభుత్వానికి అందజేస్తాం. బడ్జెట్ కేటాయింపు జరగ్గానే టెండర్ల పిలికి పనులు చేపడతాం.


మహబూబాబాద్‌లో రైతులకు యూరియా బస్తాలను ఎత్తుతున్న జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్


మహబూబాబాద్ పీఏసీఎస్ వద్ద సొమ్మసిల్లి పడిపోయిన మహిళా రైతు వసంత


కేసముద్రం కల్వలలో యూరియా కోసం లైనులో నిల్చున్న రైతులు


డోర్నకల్‌లో పీఏసీఎస్ ఎదుట బారులు తీరిన రైతులు


గూడూరులో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు


ఇనుగుర్తిలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు

రైతుల ఆగ్రహం

(5వ పేజీ తరువాయి)

ఆగ్రహం వ్యక్తం చేశారు. తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్ సంఘటన స్థలానికి చేరుకొని యూరియా ఇవ్వాలని ఆదేశించడంతో రైతులు బస్తాలు తీసుకున్నారు. యూరియా దొరకని రైతులు నిరాశతో వెళ్లిపోయారు.

యూరియా అందించాలని రాస్తారోకో

గూడూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతాంగం పంటలకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ గూడూరు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మండల కేంద్రంలోని ఓ ఎరువుల దుకాణానికి 420 బస్తాల యూరియా రాగా, సుమారు 1500 మంది రైతులు వచ్చి క్యూలైన్‌లో బారులు తీరారు. సరిపడా అందకపోవడంతో ఆ ఎరువుల దుకాణం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఆపై గూడూరు జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న సీఐ సూర్యప్రకాష్, ఏవో అబ్దుల్‌మాలిక్, ఎస్సై గిరిధర్‌రెడ్డిలు సరిపడా యూరియా అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

పాత టోకెన్లు రద్దు

యూరియా కోసం గతంలో రైతులకు జారీచేసిన టోకెన్లను రద్దు చేస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, మండల వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ మాలిక్ తెలిపారు. గూడూరు మండల కేంద్రంలోని వడ్డెరగూడెం శివారులో ఉన్న రైతు వేదికలో శనివారం క్షేత్రస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇక నుంచి యూరియా పంపిణీని క్లస్టర్ల వారీగా పంపిణీ చేస్తామన్నారు. మండలాన్ని ఐదు క్లస్టర్లుగా విభజించినట్లు పేర్కొన్నారు. రైతులకు సరిపడా యూరియా అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ నాగభవాణి, ఎస్సై గిరిధర్‌రెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

టోకెన్ల పంపిణీలో వివాదంతో రాస్తారోకో

ఇనుగుర్తి(ఆంధ్రజ్యోతి): ఇనుగుర్తి రైతు వేదిక వద్ద శనివారం యూరియా టోకెన్ల పంపిణీలో వివాదం ఏర్పడడంతో కేసముద్రం-తొర్రూరు రహదారిపై రైతులు రాస్తారోకోకు దిగారు. ఐదు రోజుల క్రితం యూరియా టోకెన్ల జారీ కోసం సుమారు 500 మంది రైతుల నుంచి పట్టా పాస్‌పుస్తకాలు, ఆధార్‌కార్డుల జిరాక్సులను వ్యవసాయాధికారులు తీసుకున్నారు. వీటి వరుస క్రమంలో 300 మందికి టోకెన్లను జారీ చేయగా, మిగిలిన 200 టోకెన్లను జారీచేసే ప్రక్రియను అధికారులు చేపట్టారు. అయితేజిరాక్సులు ఇచ్చిన రైతులతోపాటు అదనంగా మరికొంత మంది రైతులు అక్కడికి చేరుకొని తమకే టోకెన్లు ఇవ్వాలని అధికారులతో వాదనకు దిగారు. ఈ వివాదంతో టోకెన్లను జారీ చేయకుండా నిలిపివేశారు. మరుసటి రోజు నుంచి పట్టా పాస్‌పుస్తకాల నెంబర్ల ఆధారంగా యూరియా పంపిణీ చేస్తామని ప్రకటించారు. దీంతో టోకెన్లు పంపిణీ చేయాలనే డిమాండ్‌తో రైతులు రాస్తారోకో చేపట్టడంతో పోలీసులు కొద్దిసేపటికే రైతులను సముదాయించి విరమింపజేశారు.

డోర్నకల్‌లో బారులు తీరిన రైతులు

డోర్నకల్(ఆంధ్రజ్యోతి): డోర్నకల్‌లో రైతులు యూరియా కోసం పీఏసీఎస్, మన గ్రోమోర్, ముల్కలపల్లిలోని మన గ్రోమోర్ సెంటర్ల వద్దకు శనివారం తెల్లవారుజామునే తరలివచ్చారు. బస్తాల కోసం రైతులు క్యూలైన్‌లో నిలబడి బారులు తీరారు. ఆయా సొసైటీలు, మన గ్రోమోర్ సెంటర్ ద్వారా సుమారు 40 టన్నుల యూరియాను రైతులకు అందించినట్లు మండల వ్యవసాయాధికారి మురళీమోహన్ తెలిపారు. రైతులు ఎవరు అధైర్య పడవద్దని అందరికీ సరిపడా యూరియా అందిస్తామని చెప్పారు.

ముందస్తు జాబితాలతో పంపిణీ

కేసముద్రం(ఆంధ్రజ్యోతి): కేసముద్రంలో అధికారులు అవలంభిస్తున్న నూతన విధానంతో గత నాలుగు రోజులుగా ఇక్కడ యూరియా పంపిణీలో ఎలాంటి వివాదాలు చోటు చేసుకోవడం లేదు. యూరియాను రెవెన్యూ గ్రామాల వారీగా కేటాయింపులు చేసి ఆయా గ్రామాల్లో పట్టాదారు పాస్‌పుస్తకాల సీరియల్ నెంబర్ ఆధారంగా పంపిణీ చేస్తున్నారు. ఇందుకోసం ముందస్తుగా సమాచారం ఇస్తుండడంతో ఆయా నెంబర్లకు చెందిన రైతులే వచ్చి తీసుకువెళుతున్నారు. ఈ విధానంపై కేసముద్రం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీవో మధుసూదన్‌రాజు, ఎంపీడీవో క్రాంతి, డీటీ ఎర్రయ్య, ఏవో వెంకన్న, ఎస్‌ఐ కరుణాకర్‌లు ఆయా శాఖల ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. మండలంలోని రెండు సొసైటీలు ఆరు ఎరువుల విక్రయ కేంద్రాలు, రెండు ఎఫ్‌పీవోల ద్వారా యూరియా పంపిణీ కొనసాగుతున్నట్లు ఏవో తెలిపారు.

పంచాయతీల వారీగా పంపిణీ

బయ్యారం(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇక నుంచి గ్రామ పంచాయతీల వారీగా యూరియా పంపిణీ చేయనున్నట్లు ఏవో రాంజీ నాయక్ తెలిపారు. యూరియా కొరత నేపథ్యంలో చోటుచేసుకుంటున్న నిరసనలను అధిగమించేందుకు గాను అధికారులు కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం బయ్యారం మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, వ్యవసాయం, మండల పరిషత్ అధికారుల నడుమ కో-ఆర్డినేషన్ సమావేశం జరిగింది. అనంతరం ఏవో మాట్లాడుతూ అలాట్‌మెంట్ ప్రకారం జీపీల వారీగా రైతులకు యూరియా పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. పంపిణీకి ముందు రైతుల పేర్లు ప్రకటిస్తామని, అందుకు సంబంధించిన రైతులు మాత్రమే సంబంధిత కేంద్రాలకు వచ్చి యూరియా తీసుకెళ్లాలన్నారు. రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకరావాలన్నారు. కాగా, బయ్యారం మండలం ఏజన్సీ ప్రాంతం కావటంతో పట్టాదారు పాస్‌పుస్తకం లేని రైతులను పరిశీలించి ఆధార్‌కార్డు ఆధారంగా యూరియా పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. లిస్టులో పేరు లేని రైతులు వచ్చి తమ సమయాన్ని వృధా చేసుకోవద్దని సూచించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఆర్‌ఐ సందీప్, ఎంపీవో చంద్రమోహన్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. కాగా, ఇప్పటి నుంచి టోకెన్ పద్ధతి ద్వారా యూరియా పంపిణీ చేయడం జరగదని స్పష్టం చేశారు.

యూరియా సరఫరాకు పకడ్బందీ చర్యలు

▸▸ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా సరఫరాకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్‌లోని కలెక్టరేట్‌లో శనివారం మండల ప్రత్యేకాధికారులు, వ్యవసాయ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటి వరకు 23,749.296 మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకాలు జరిపామని, శనివారం 750 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించడం జరిగిందని చెప్పారు. ఇంకా వచ్చే యూరియాను ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు అందించేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మండలాల వారీగా రైతులకు ముందస్తు సమాచారంతో యూరియాను ప్రణాళిక ప్రకారం ఆన్‌లైన్ విధానం పీవోఎస్ రిజిస్టర్లలో నమోదు చేసి అమ్మకాలు కొనసాగించాలన్నారు. ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న నిల్వలను తనిఖీచేస్తూ అక్కడ ఉన్న స్టాక్‌ను రైతులకు అమ్మకాలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

నిబంధనలు అతిక్రమించిన షాపుల లైసెన్స్ రద్దు

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ ఫర్టిలైజర్ షాపులను గుర్తించి ఇప్పటికే వారి లైసెన్స్‌లను రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు. ఎవరైనా ఉద్దేశ్యపూర్వకంగా రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కొనుగోళ్లు అధికంగా ఉన్న కేంద్రాల వద్ద అదనపు క్యూలైన్లు ఏర్పాటు చేయడం, తాగునీటి సదుపాయాలు కల్పించాలన్నారు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. యూరియా కేంద్రాల వద్ద స్టాక్ వివరాలను ప్రదర్శించాలన్నారు. యూరియా పంపిణీ తేదీలు, సమయంపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, అనిల్‌కుమార్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయనిర్మల, డీసీవో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి, డీఎస్పీ తిరుపతి రావు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల కష్టాలు

● ప్రైవేటు వ్యాపారులకు కేటాయింపు

తొర్రూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 2న అధికారులు గత నెల 28 వరకు టోకెన్‌లు ఇచ్చిన రైతులకు యూరియా సరఫరా చేస్తామని చెప్పి తొర్రూరు రైతు వేదిక వద్ద ఇద్దరే ఏఈవోలను ఏర్పాటు చేసి టోకెన్‌లతో పాటు ఆధార్‌లు తీసుకుని బస్తాలు మంజూరు చేశారు. కానీ ఆ రోజు అక్కడికి వచ్చిన రైతులకు యూరియా దొరకక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బుధ, గురువారాలు టోకెన్‌లు ఇస్తాం, యూరియా వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు మాయ మాటలు చెబుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, బుధవారం ప్రైవేటు షాపులకు 10 నుంచి 15టన్నుల యూరియా కేటాయించడంతో అధిక ధరలతో పాటు కాంప్లెక్స్ ఎరువులు, గుళికలు కొనాలని ఇబ్బందులు పెట్టారు. దీంతో పలువురు రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించగా మాకు సంబంధం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య భవిష్యత్‌కు భరోసా

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : లక్ష్యాన్ని ఎంచుకొని క్రమ శిక్షణ, పట్టుదలతో కూడిన విద్యనభ్యసిస్తే భవిష్యత్‌కు భరోసా నిస్తుందని మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శనివారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించి 2025 ఎస్సెస్సీ వార్షిక పరీక్షల ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన 10 మంది విద్యార్థులకు యంగ్ మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్(వైఎంసీఏ) సెక్రటరీ బొడ్డు సుధాకర్ నేతృత్వంలో నగదు, మెమెంటోలను అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు శకుంతల, అనీస్‌ఫాతిమా, తిరుమ భిక్షం, శ్రీనివాస్, విజయ్‌కుమార్, సునిత, విజయలక్ష్మిలనుసన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఆరుద్ర వెంకటేశ్వర్లు, వైఎంసీఏ బాధ్యులు బొడ్డు శశికళ, పాపయ్య, వెంకటయ్య, నారాయణయాదవ్, ఫాదర్ అనుదీప్ పాల్గొన్నారు.

ఓటరు లిస్టులో అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయండి

కొత్తగూడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఓటరు లిస్టులో అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని ఎంపీడీవో రోజారాణి సూచించారు. కొత్తగూడ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీటీసీ ఎన్నికల ఓటరు లిస్టు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రోజారాణి మాట్లాడుతూ ఓటరు లిస్టులో అభ్యంతరాలు ఉంటే ఈనెల 8న సాయంత్రం 3గంటల వరకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వాసుదేవరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వనమాల, సిబ్బంది రూప్‌కుమార్, దేవేందర్, శ్రీను పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌తో విద్యార్థులకు ఆర్థిక ప్రయోజనం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైతే విద్యార్థులకు ఎంతో ఆర్థిక ప్రయోజనం ఉంటుందని స్ఫూర్తి ఎడ్యుకేషన్ ఫౌండేషన్ కార్యదర్శి మేకల కృష్ణయ్య అన్నారు. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం డోలి గిరిజ అధ్యక్షతన 8వ తరగతి విద్యార్థులకు స్ఫూర్తి ఎడ్యుకేషన్ ఫౌండేషన్, తెలుగు సేవా సమితి ఆఫ్ నెబ్రాస్కా బాధ్యులు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పోటీ పరీక్షల పుస్తకాలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామసహాయం శ్రీధర్‌రెడ్డి, సభ్యులు వినోద్, ఉపాధ్యాయులు ఉప్పలయ్య, సోహెన్‌బీ, శ్రీనివాసరావు, తిరుపతి పాల్గొన్నారు.

కొత్త 'గ్రూపులు'

(5వ పేజీ తరువాయి)

ముమ్మరంగా సెర్ప్ సిబ్బంది కృషి చేస్తున్నారు.

ఎవరెవరు అర్హులంటే..?

జిల్లాకు చెందిన 12నుంచి 18ఏళ్ల మధ్య వయసున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థినులు 10 నుంచి 15 మందితో కిషోర బాలికల సంఘాన్ని ఏర్పాటు చేస్తారు. ఇందులోని ఇద్దరు లీడర్లతో ఉమ్మడి బ్యాంకు ఖతాను తీస్తారు. నెలలో మూడు సమావేశాలు నిర్వహిస్తూ బాలికలకు లింగ వివక్ష, భద్రత, ఆరోగ్యం, చట్టాలు, సంక్షేమ పథకాలు, జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించేందుకు పోలీసు, వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ, సెర్ప్ శాఖలు కృషి చేస్తాయి. అలాగే 60ఏళ్ల పైబడిన వృద్ధులతో ఏర్పాటు చేసే సంఘాల్లో వారి పోషణ భరోసా, ఆరోగ్యం, ఒంటరితనం దూరం చేయడం లక్ష్యాలతో ఈ సంఘాలు పనిచేస్తాయి. యూనిక్ డిసేబిలిటీ ఐడీ(యుడీఐడీ)/సదరం ధృవీకరణ పత్రం ఉన్న ఏడాది పైబడిన స్త్రీ, పురుష దివ్యాంగులతో సంఘం ఏర్పాటు చేస్తున్నారు. మానసిక దివ్యాంగులైతే వారి తండ్రి సంరక్షకుడిగా వ్యవహరిస్తూ సభ్యుడిగా ఉంటారు. అలాగే ఇప్పటి వరకు ఏ సంఘంలో లేని 18-59ఏళ్ల మహిళలతోను గ్రూపులను చేయడం, వారిని అవకాశం ఉన్న సమీప గ్రూపుల్లో చేర్పించడం చేస్తున్నారు. ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా పొదుపు చేసుకుంటే ఆయా నూతన సంఘాలకు రూ.15వేల మ్యాచింగ్ గ్రాంటును ప్రభుత్వం అందించడం గమనార్హం. ఈ మ్యాచింగ్ గ్రాంటును తిరిగి చెల్లించాల్సిన అవసరం ఉండదు. ఏదేమైనా విద్య, వైద్యం, సంక్షేమం, ఆర్థిక, పోషణ భరోసా వంటి లక్ష్యాలతో నూతనంగా కొత్త తరహా సంఘాలు ఏర్పాటవుతుంది వాస్తవం.

సీపీఎం నేత శ్రీనివాస్‌కు మాతృవియోగం

● ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నేతల నివాళి

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ తల్లి రామనర్సమ్మ(90) శనివారం తుది శ్వాస విడిచారు. ఆమెకు ఏకైక కుమారుడు శ్రీనివాస్ సంతానం. విషయం తెలుసుకున్న ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్య, పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డోలి సత్యనారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి, జయసారథిరెడ్డి, న్యూడెమోక్రసీ నాయకులు మండల వెంకన్న, గౌని ఐలయ్య, ఐఎంఏ అధ్యక్షుడు బానోత్ నెహ్రూరాథోడ్, గాయత్రి అధినేత వద్దిరాజు కిషన్, వ్యాపారవేత్త నాళ్ల వీరన్న, కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, మాజీ సర్పంచ్ భూక్య నెహ్రూనాయక్, లయన్స్ క్లబ్ బాధ్యులు రామసహాయం వెంకట్‌రెడ్డి, రావుల రవిచందర్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నేతలు మైస శ్రీనివాస్, సామ మల్లారెడ్డి, కళ్లెం వీరారెడ్డి రామనర్సమ్మ మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. పట్టణంలోని హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తిచేశారు.


రామనర్సమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్, నాయకులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కేసముద్రం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం ఆర్వోబీపై శనివారం ఉదయం బొలెరో వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన ప్రకారం.. ధన్నసరికి చెందిన కటకం హరిప్రసాద్, కటకం శంకర్‌లింగం బైక్‌పై మార్కెట్ వైపు నుంచి పొట్టి శ్రీరాములు సెంటర్‌కు వెళుతున్నారు. అదే సమయంలో ఎదురుగా బొలెరో వాహనం ద్విచక్ర వాహనం వైపునకు వచ్చి ఢీకొన్నట్లుగా స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో హరిప్రసాద్ తల, కాలికి, శంకర్‌లింగం కాలికి తీవ్ర గాయాలయ్యాయి. 108 ఈఎంటీ లకావత్ నరేష్ ప్రాథమిక చికిత్సనందించగా వాహనం పైలెట్ ప్రశాంత్ హుటాహుటిన మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జనం

మరిపెడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని ఆర్‌ఎస్ ప్లాజా భక్తమండలి, చంద్యానాయక్ నగర్, బోడా అమ్మనాయక్ కాలనీ వినాయక విగ్రహాలను శనివారం మాకుల పెద్ద చెరువులో ఆయా ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఘనంగా నిమజ్జనం చేసి గణేశుడికి బై బై చెప్పారు. ఆర్‌ఎస్ ప్లాజా నిర్వాహకులు వినూత్న రీతిలో ఇతర రాష్ట్రాలకు చెందిన వాయిద్యా కళాకారులను రప్పించి డప్పు, డోలు నృత్యాలతో హోరెత్తించారు. పట్టణ పురవీధుల్లో వినాయకుడిని అంగరంగ వైభంగా ఊరేగించారు. పట్టణ ప్రజలు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయా భక్తమండళ్ల నిర్వాహకులు ఈ ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొని రంగులు చల్లుకున్నారు.

మరిపెడ మోడల్ స్కూల్ టీచర్ అమెరికా ఎఫ్‌టీఈఏ ప్రోగ్రామ్స్‌కు ఎంపిక


సోన్‌బన్ ఆంథోని డిసౌజాని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

మరిపెడ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):మరిపెడ మోడల్ స్కూల్ టీచర్ సోన్‌బన్ ఆంథోని డిసౌజా అమెరికా ఫుల్‌బ్రైట్ టీచింగ్ ఎక్సలెన్స్ అచీవ్‌మెంట్ ప్రోగ్రామ్స్‌కు ఎంపికైనట్లు స్కూల్ ప్రిన్సిపాల్ అక్తర్‌పాషా శనివారం విలేకరులకు తెలిపారు. అమెరికా గ్రీన్స్‌బోరోలోని నార్త్ కరోలినా విశ్వవిద్యాలయంలో ఫాల్ 2025లో ఆరు వారాల పాటు జరిగే ఎఫ్‌టీఈఏ ఫెలోషిప్ ప్రోగ్రామ్స్‌లో పాల్గొని ఉపాధ్యాయ వృత్తి నైపుణ్యతను ప్రదర్శించనున్నారు. దీనికోసం ప్రపంచ వ్యాప్తంగా వేలాది మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఈ అవకాశం మరిపెడ మోడల్ స్కూల్‌కు దక్కడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోన్‌బన్ ఆంథోని డిసౌజాను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈనెల 10న డిసౌజా అమెరికాకు వెళ్లనున్నట్లు చెప్పారు.

భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

● లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ బి.వీరన్న

● ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని లయన్స్‌క్లబ్ మానుకోట శాఖ అధ్యక్షుడు డాక్టర్ బి.వీరన్న అన్నారు. మహబూబాబాద్ పట్టణంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు పూరే గురునాథరావు, శ్రీవాణి దంపతులను శుక్రవారం రాత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ వీరన్న మాట్లాడుతూ.. నిత్య విద్యార్థిగా కొత్త విషయాలను నేర్చుకుంటూ ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది దేశానికి అందిస్తున్న ఘనత ఉపాధ్యాయులదని చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి పర్కాల రవీందర్‌రెడ్డి, బాధ్యులు పీవీ.ప్రసాద్, కొండపల్లి కేశవరావు, పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, రామసహాయం వెంకట్‌రెడ్డి, రావుల రవిచందర్‌రెడ్డి, నూకల నర్సింహారెడ్డి, యాళ్ల మురళీధర్‌రెడ్డి, వైద్యులు అర్జున్‌రెడ్డి, దేవిరెడ్డి, వి.జగన్మోహన్‌రావు, బి.అనిల్ గుప్తా, చంద్రశేఖర్, ఇంద్రసేనారెడ్డి, రంజిత్‌రెడ్డి, పి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌కు మార్గనిర్దేశకులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్‌కు మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులేనని ఏసీజీఈ మందుల శ్రీరాములు అన్నారు. మహబూబాబాద్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తూ విద్యాభివృద్ధి, పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం 27 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి ఎంఈవో వెంకటేశ్వరరావుతో కలిసి ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ... దేశ భవిష్యత్ తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుందని, సమాజాన్ని ప్రగతి వైపు నడిపించే శక్తి కేవలం ఉపాధ్యాయులకే ఉంటుందన్నారు. ఎంఈవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... జిల్లాలో అత్యధికంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించిన మండలంగా మానుకోట నిలిచిందన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు కోట్యానాయక్, డోలి గిరిజ, సమ్మెట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులే..

గూడూరు(ఆంధ్రజ్యోతి): సమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులేనని ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్టీవో రఫీ, ఎంఈవో రవికుమార్, అరవింద విద్యాలయ కరస్పాండెంట్ పింగిలి శ్రీనివాస్‌లు అన్నారు. గూడూరు మండల పరిషత్‌లో శనివారం మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 32 మందికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రశంసా పత్రాలను అందించి సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల ఎదుగుదలకు ఉపాధ్యాయుల కృషి మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు సత్యనారాయణ, ఫరూక్, దూప్‌సింగ్, రవిచంద్ర, ధర్మానాయక్, ఆదినారాయణ, దుబ్బకట్ల రమేష్, బోడ రమేష్, మల్లేష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

పెద్దవంగర(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని మండల విద్యాశాఖాధికారి బుధారపు శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కారాల్లో భాగంగా మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 12మందిని శాలువా, షీల్డులతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువును మించిన దైవం లేదని అన్నారు. దేశ భవిష్యత్ దిక్సూచి ఉపాధ్యాయులే అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు విజయకుమార్, కళాధర్, శేషవల్లి, లీలారాణి, రమేశ్ కుమార్, వెంకన్న, సతీష్, దేవదాస్, మధుసూదన్‌రెడ్డి, సీఆర్పీలు సంతోష్, నిరంజన్, రంగయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది

తొర్రూరు(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఎంఈవో బుచ్చయ్య, వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకుడు తక్కెళ్లపల్లి రవీంద్ర అన్నారు. శనివారం తొర్రూరులో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఘనంగా మండలస్థాయి ఉపాధ్యాయ వేడుకలు నిర్వహించి వారు మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రంగా భావించి ఉపాధ్యాయులు వేలాది మంది విద్యార్థులను కార్యోన్ముఖులుగా చేసి ఉన్నత లక్ష్యాల్లో నిలిచే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్ అందించిందని, వీటితో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. అనంతరం ఎంపికైన ఉపాధ్యాయులను శాలువా, మెమొంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సతీష్‌రెడ్డి, విప్లవ్ రెడ్డి, బి.వి.రావు, జనార్దన్, వీరన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు చిదిరాల నవీన్‌కుమార్ ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. పేద ప్రజలకు ఉచిత విద్య అందించడంలో ఉపాధ్యాయులు చేస్తున్న సేవ ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో ఇమ్మడి రాంబాబు, నిరంజన్, రమేశ్, శ్రవణ్ కుమార్, తమ్మి రమేష్, శ్రీనివాస్, గీత, గోపాల్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


మహబూబాబాద్‌లో ఉపాధ్యాయులు గురునాథరావు-శ్రీవాణి దంపతులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు


తొర్రూరులో ఉత్తమ ఉపాధ్యాయురాలు రాపెల్లి లతను సత్కరిస్తున్న ఎంఈవో బుచ్చయ్య, తదితరులు